క్లుప్తంగా

రొద్దం, ఎన్పీ కుంట జట్ల విజయం



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న దృశ్యం

పెనుకొండ: యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీలో భాగంగా ఆదివారం పట్టణంలోని మైదానంలో క్రికెట్ మ్యాచులు సజావుగా జరిగాయి. పోటీలను యూటీఎఫ్ టోర్నమెంట్ కన్వీనర్ నరేష్ ప్రారంభించారు. పుట్టపర్తి – రొద్దం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పుట్టపర్తి జట్టు 12 ఓవర్లలో 83 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన రొద్దం జట్టు నిర్ణీత ఓవర్ల లోపే లక్ష్యాన్ని సాధించి విజయం సాధించింది. ఎన్పీ కుంట, మడకశిర జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో ఎన్పీ కుంట జట్టు గెలుపొందింది. గంగాధర్, యోగిలకు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు సుధాకర్, నరేష్, శివయ్య తదితరులు బహుమతులు అందజేశారు.

ముగిసిన క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

హిందూపురం టౌన్: స్థానిక విద్యారణ్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఉమ్మడి అనంతపురం జిల్లా సరస్వతీ విద్యా మందిరాల జూనియర్ లెవెల్ ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విద్యారణ్య సభ్యులు ప్రకాష్ రంజన్, అభిషేక్ ఉపాధ్యాయ, ఎంఈఓ గంగప్ప, పాఠశాల పూర్వ విద్యార్థి, ఎస్ఐ విష్ణు ప్రతాప్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అథ్లెటిక్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. విజేతలకు విశాంత్ర పట్టు పరిశ్రమ అధికారి ఆదినారాయణరావు, ఎంపీడీఓ నరేంద్రకుమార్‌ల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చన్నారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు విధిగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలన్నారు.

కరాటేలో 'పురం' విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో బహుమతులు పొందిన విద్యార్థులు

హిందూపురం: కర్ణాటకలోని బెంగళూర్ సీఎంఏ గ్రాండ్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన 11వ షోటోకన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో హిందూపురం విద్యార్థులు ప్రతిభ చాటినట్లు సీనియర్ కరాటే మాస్టర్ రఫీక్ అహ్మద్, జనార్దన్‌రెడ్డి, రియాజ్‌బాషా తెలిపారు. హిందూపురం ఎల్ఆర్‌జీ పబ్లిక్ స్కూల్, డీవీడీ బీఎస్ చిన్మయ విద్యాలయ, లోటస్ పబ్లిక్ స్కూల్, శాసనకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. 38 విద్యార్థులు పోటీలో పాల్గొని ప్రతిభ కనబరచి బహుమతులు అందుకున్నారు. మొత్తం 42 మెడల్స్ సాధించారని మాస్టర్లు తెలిపారు.

ముస్తాబైన ఆలయాలు

రొళ్ల: మండల పరిధిలోని పలు ఆలయాలు శ్రావణ మాసానికి ముస్తాబయ్యాయి. జీరిగేపల్లి అమ్మాజీ, కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామి, రొళ్లలోని శనేశ్వరస్వామి, లక్ష్మీనరసింహస్వామి, రొళ్లకొండ ఈశ్వర ఆలయంతో పాటు రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి, కాకి మల్లేశ్వరస్వామి, ఎం.రాయాపురం చంద్రమౌళేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం నుంచి ప్రత్యేక పూజలను నిర్వహించనున్నారు.

చదువులు ముందుకు సాగేదెలా?

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువులు గాడితప్పాయి. ముఖ్యంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పట్టిపీడిస్తోంది. దీంతో ఉన్న ఉపాధ్యాయులే ఆ సబ్జెక్టులను కూడా బోధించాల్సిన పరిస్థితి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం టీచర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినా టీడీపీ నాయకులు కుట్రతో దాన్ని అడ్డుకున్నారు. ఆఖరికి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను చేపట్టేందుకు యత్నించగా దానికీ మోకాలడ్డటంతో దారుణ పరిస్థతులు నెలకొన్నాయి. తమ బిడ్డలు చదువులో వెనుక బడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మధ్యాహ్న భోజన ఏజెన్సీలను హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో దాదాపుగా మార్చేశారు. అడిగేవారు కూడా లేకపోవడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. చాలా చోట్ల ఉడికీ ఉడకని అన్నం... నీళ్ల కూరనే గత్యంతరంగా మారిందని విద్యార్థుల తల్లి దండ్రులు విమర్శిస్తున్నారు.

- గత ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలను అడ్డుకున్న టీడీపీ నేతలు
- ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత
- ఉన్న టీచర్లే సిలబస్ చెబుతున్న వైనం
- కొన్నిచోట్ల విద్యార్థులకు అందని 'కానుక'
- దాదాపుగా అన్నిచోట్లా మధ్యాహ్న భోజన ఏజెన్సీల మార్పు
- ఉడికీ ఉడకని అన్నం.. నీళ్ల కూరనే గతి
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన



గుడిబండ మండలం మద్దనకుంటలోని ఉన్నత పాఠశాల

హిందూపురం/హిందూపురంఅర్బన్: మున్సిపాలిటీ పరిధితో పాటు మండలంలో మధ్యాహ్న భోజనం పంపిణీపై సరైన తనిఖీలు, పర్యవేక్షణ లేకపోవడంతో చాలా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావడం లేదు. అన్నం సక్రమంగా ఉండటం లేదని, అన్నం ముద్దగా ఉంటోందని, అలాగే అందులోకి వేసే కూరలు నీళ్లకంటే దారుణంగా ఉంటోందని విద్యార్థులు వాపోతున్నారు. కోడిగుడ్ల పంపిణీ కూడా సరిగాలేదంటున్నారు. కొన్ని స్కూల్‌లో కోడిగుడ్లను పిల్లలకు ఇంటికి ఇచ్చి పంపిస్తున్నారు.

- మొత్తం 13,575 మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫారాలు అందించారు. అందులో కొందరికి బూట్లు అందలేదు.
- నియోజకవర్గంలో చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. బదిలీలు నిలిచిపోవడంతో ఉపాధ్యాయుల కొరత పట్టిపీడిస్తోంది. హిందూపురం పరిధిలో మొత్తం ఉపాధ్యాయులు 679 మంది ఉన్నారు. మౌలానా ఆజాద్ యూపీ స్కూల్‌లో 1 నుంచి 8 వరకూ తరగతులు ఉన్నాయి. 200 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు. ఇంకా ఆరుగురు ఉపాధ్యాయులు అవసరం ఉన్నారు. అలాగే జాకీర్ హుసేన్ యూపీ స్కూల్‌లో 256 మంది విద్యార్థులు ఉండగా ముగ్గురు ఉపాధ్యాయులున్నారు. మరో 8 మంది అవసరం. అలాగే ఆజీయా హైస్కూల్‌లో సుమారు 800 మంది విద్యార్థులకు అనుగుణంగా మరో 8 మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది. ముదిరెడ్డిపల్లి జెడ్పీహైస్కూల్, సంతేబిదనూర్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్, కొట్నూరు స్కూల్, ప్రైమరీ స్కూళ్లలోనూ టీచర్ల కొరత ఉంది.

లేపాక్షి: మండల వ్యాప్తంగా 58 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ఏపీ గురుకుల, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు ఉన్నాయి. 5,150 మంది విద్యార్థులు, 250 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. తక్కవగా చోట ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు చెబుతున్నారు. అలాగే మండలంలో మధ్యాహ్న భోజనం సరిగా ఉండటం లేదని విద్యార్థులు చెబుతున్నారు.

చిలమత్తూరు: మండల వ్యాప్తంగా 73 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 4,238 విద్యార్థుల సంఖ్య ఉంది. మండల వ్యాప్తంగా 73 మధ్యాహ్న భోజన ఏజెన్సీలు ఉన్నాయి. ఇందులో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 33 ఏజెన్సీలను మార్చారు. నామమాత్రమేగా మధ్యాహ్న భోజన పథకం అమలవుతోందని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు.

గుడిబండ: మండల వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ఎమ్‌జేపీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలతో కలిపి మొత్తం 70 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అయితే మండలపల్లి, మద్దనకుంట, పీసీ గిరి పాఠశాలలో టీచర్ల కొరత ఎక్కువగా ఉంది. చాలా స్కూళ్లలో సాంఘికశాస్త్రం, గణితం, ఇంగ్లిష్, బయో సైన్స్ సబ్జెక్టులకు టీచర్ల లేరు. దీంతో ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులు వెనుకబడి పోతున్నారు. మండలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొన్ని నెలలుగా పీఈటీ లేకపోవడంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపం కపిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రొళ్ల: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల, కేజీబీవీ ప్రభుత్వ పాఠశాలల మొత్తం 65 ఉన్నాయి. మధ్యాహ్నం భోజనం పథకం అములులో ప్రస్తుతం ప్రభుత్వంలో ఎండీఎం నిర్వాహకులను మార్పు చేయడంతో సక్రమంగా మెనూ పాటించడం లేదు. రొళ్ల, హొట్టేబెట్ట, బీజీ హళ్లి, రత్నగిరి, హెచ్‌టీ హళ్లి ఐదు ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ ఉపాధ్యాయులు కొరత ఉంది. దీంతో అక్కడి విద్యార్థులు ఆ సబ్జెక్టులో వెనుకబడుతున్నారు.

200 మంది కిట్లేవీ?

మడకశిర రూరల్: మడకశిర పరిధిలో మొత్తం 109 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 8,241 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఇందులో ఇంకా 200 మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందించలేదు. త్వరగా తమ బిడ్డలకు విద్యా కానుక కిట్లను అందించాలని తల్లి దండ్రులు కోరుతున్నారు.

పట్టిపీడిస్తున్న ఉపాధ్యాయుల కొరత

అగళి: మండలంలో 45 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అయితే ఇందులో ప్రాథమిక పాఠశాలలో 88 మంది టీచర్లకు గాను 72 మంది మాత్రమే ఉన్నారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 80 మందికి గాను 67 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఆలూడి ప్రాథమిక పాఠశాలలో 1, 2 తగరతికి చెందిన విద్యార్థులకు కలిపే చదువు చెబుతున్నారు.



అగళి మండలం ఆలూడి పాఠశాలలో 1, 2 తరగతి విద్యార్థులను ఒకేచోట కూర్చోబెట్టి బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య ఇలా...

నియోజకవర్గం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
హిందూపురం	324	46,194
పెనుకొండ	300	20,453
మడకశిర	351	29,056



హిందూపురంలోని పీకేఎస్ఆర్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

సంఖ్య తగ్గితే మూతనే...

గోరంట్ల: పెనుకొండ నియోజకవర్గంలో పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, పరిగి, గోరంట్ల మండలాలు ఉన్నాయి. ఇందులో గోరంట్ల మండలంలో బుడ్డపల్లి, దాసిరెడ్డిపల్లి తండా, పెట్ల కుంటపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేక మూతపడ్డాయి. అలాగే పరిగి మండలంలోని ఊటుకుర పంచాయతీ పరిధిలోని అక్కంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మూసేశారు. రొద్దం మండలంలో చిన్నకొడిపల్లిలోని పాఠశాల కూడా మూతపడింది. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 30కి పైగా పాఠశాలల్లో 10 లోపు విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మరికొన్ని వచ్చే విద్యా సంవత్సరం మూతపడే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఇక.. మధ్యాహ్న భోజన పథకం సరిగా ఉండటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



గోరంట్ల: పెట్లకుంటపల్లి గ్రామంలో మూతపడిన ప్రభుత్వ పాఠశాల

బడి మూసేయడం బాధాకరం



మా గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసుకోవడానికి గతంలో గ్రామస్తులు అందరూ ఎంతో కష్టపడ్డారు. ఆఖరికి బడి వచ్చేలాగా చేసుకున్నాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల సంఖ్య లేని కారణంగా అధికారులు పాఠశాలను మూసివేశారు. దీంతో ప్రస్తుతం అందరూ బాధపడాల్సి వస్తోంది. గత్యంతరం లేక ప్రైవేటు బడులకు పంపుతున్నారు.

– గజేంద్ర, పెట్టకుంటపల్లి, గోరంట్ల మండలం

టీచర్లు లేకపోతే ఎలా?



నాకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. వారు ఆలూడిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 3వ తరగతి, 6వ తరగతి చదువుతున్నారు. అయితే పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో వారి చదువు సరిగా ముందుకు సాగడం లేదు. ఉన్నటీచర్లే ఇతర సబ్జెక్టులను బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. పిల్లలకు నాణ్యమైన విద్య అందాలంటే కచ్చితంగా ఉపాధ్యాయులను నియమించాలి.

– హరిష్ , ఆలూడి, అగళి మండలం

ఉద్యోగం ఊడింది



మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో వంట మాస్టర్‌గా పనిచేసేవాడిని. ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్నాను. అయితే భోజన ఏజెన్సీని బలవంతంగా మార్చేయడంతో నా ఉద్యోగం కూడా ఊడింది. ఇప్పుడు నా కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థిత నెలకొంది. ప్రభుత్వం మారిన వెంటనే టీడీపీకి చెందిన కార్యకర్తలను తీసుకోవడంతోనే ఈ పరిస్థితి దాపురించింది.

– మూర్తి, గుడిబండ

భోజనం నాణ్యతతో వడ్డించాలి



మా పిల్లలు కొట్నూరు ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలల పూర్తయినా చాలా మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో పుస్తకాలు, దుస్తులు, బూట్లు అందించలేదు. కొందరికి ఇచ్చారు ఇంకొందరికి ఇవ్వలేదు. దీనికి తోడు పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో నాణ్యత తగ్గింది. నాణ్యత పాటించేలా అధికారులు పరిశీలించాలి. అలాగే ఉపాధ్యాయుల కొరతలేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

– వెంకటేష్, కొట్నూరు, హిందూపురం

క్షేత్రస్థాయి పంపింగ్ కేంద్రాల పరిశీలన

- మరమ్మతు బిల్లుల ప్రతిపాదనలపై అనుమానం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు



వెంకటాపురం తండా వద్ద పంపింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్ల బృందం

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటర్ల మరమ్మతులకే ప్రతి కౌన్సిల్ మీట్‌లో రూ.కోట్లు బిల్లు పెడుతున్నారంటూ ఇటీవల వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఆక్షేపించిన విషయం విధితమే. కౌన్సిల్ మీట్‌లో పెట్టిన రూ.1.50 కోట్ల నిధుల అంశాన్ని పెండింగ్‌లో ఉంచారు. ఈ నేపథ్యంలో ఆదివారం హిందూపురం మున్సిపాల్టీకి తాగునీటిని సరఫరా చేసే గొల్లపల్లి రిజర్వాయర్, మూడు పంపింగ్ కేంద్రాల పరిస్థితులు పరిశీలనకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్ల బృందంతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హిందూపురం నుంచి వీకే తండా, ఎస్‌కేడీ, గొల్లపల్లి రిజర్వాయర్‌లను ప్యానల్‌బోర్డులు, మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, రియర్వాయర్ కేంద్రాలను తనిఖీ చేశారు. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో ఇంజనీరింగ్ చెబుతున్న ప్రతిపాదనలకు ఏమాత్రం సంబంధం లేకుండా కనిపిస్తోందని మెజార్టీ కౌన్సిలర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. గొళ్లపల్లి రిజర్వాయర్ హిందూపురం మున్సిపాల్టీ పంపింగ్ కేంద్రం పక్కనే కియా కంపెనీ పంపింగ్ కేంద్రంలో 5 మోటర్లతో నీటి పంపింగ్ సాగుతోంది. అక్కడి మోటర్లు మరమ్మతులు ఉండటం లేదు. కేవలం హిందూపురం మున్సిపాల్టీ పంపింగ్ కేంద్రంలో మోటర్లలో తరచు మరమ్మతుకు రూ.లక్షలు వెచ్చించడేమిటి? ఇక్కడ పనిచేస్తున్న వారు ఏం చేస్తున్నారని కౌన్సిలర్లు ప్రశ్నించారు. వీటి కొనుగోళ్లు, మరమ్మతుకు ఒకే టెండర్‌ను వేయడం ఏమిటన్నారు. సింగిల్ టెండర్ ఆమోదించడం సరికాదన్నారు. రిజర్వాయర్‌తో పాటు మూడు పంపింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గుడిబండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కేట్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. స్నేహితుల దినోత్సవం కూడా కావడంతో ఉత్సాహంగా ఆడిపాడారు.

చిలమత్తూరు తహసీల్దార్‌గా ఆనంద్‌బాబు

చిలమత్తూరు: మండల తహసీల్దార్‌గా ఆనంద్ బాబు నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్నికల నేపథ్యంలో మండల తహసీల్దార్‌గా పనిచేసిన భాగ్యలత సొంత జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆనంద్‌బాబు గతంలో లేపాక్షి తహసీల్దార్‌గా కూడా పనిచేశారు.

సమస్యలు ఎవరికి చెప్పాలి?

- అధికారులే రాకపోతే ఎలాగని సభ్యుల మండిపాటు



రొద్దంలో సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రశేఖర్

రొద్దం: సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకపోతే సమస్యలపై ఎవరికి చెప్పాలని పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు మండిపడ్డారు. ఆదివారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి పలువురు అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో ఏఈ ఎప్పుడు సమావేశం జరిగినా హాజరుకాకపోవిడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని నిలదీశారు. ఎంపీపీ కలుగజేసుకొని సమావేశానికి హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని ఏఓ చంద్రశేఖర్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మావతి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

హిందూపురం అర్బన్: మండలంలోని గోళ్లాపురంలో ఈనెల 2న అభయకుమార్ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలుడు జరిగిన విషయం తెలిసిందే. అయితే ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అభయకుమార్ భార్య పూజా మాలిక్ (33) ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఇందులో భాగంగానే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జయంతి



హిందూపురం: బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు



సోమందేపల్లి: బోనాలతో వస్తున్న మహిళలు

హిందూపురం: చౌడేశ్వరీ జయంతి సందర్భంగా హిందూపురం పలు ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముద్దిరెడ్డిపల్లిలోని చౌడేశ్వరీదేవికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. కంసాలపేటలోని విరూపాక్షేశ్వరస్వామి దేవస్థానంలో కమిటీ ఆధ్వర్యంలో చౌడేశ్వరీదేవి ప్రత్యేక పూజలు చేపట్టారు. కొటిపి గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలో చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దమ్మ ఆలయం నుంచి ప్రదర్శనగా బోనాలు తలపై పెట్టుకొని ప్రదర్శన నిర్వహించారు. తర్వాత అమ్మవారికి సమర్పించారు.

గోరంట్ల: పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

'సుప్రీం' తీర్పు చరిత్రాత్మకం

పెనుకొండ: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇవ్వడం హర్షణీయమని బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు న్యాయవాది శివరామకృష్ణ పేర్కొన్నారు. పెనుకొండ పట్టణంలో అంబేడ్కర్ సర్కిల్లో బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో నాయకులు సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బాబు, ఈశ్వర్, వెంకటేసులు, రవి, గంగాధర్, చిన్నా, లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు జపానంద సాయం

పావగడ: ఉత్తర కర్ణాటకలోని గోకాక్, బెళగావి ప్రాంతాల్లో వరద బాధితులకు తన వంతు సాయం అందించడానికి స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానంద సిద్ధమయ్యారు. ఇందులో భాగంగానే సుమారు 5 వేల బాధిత కుటుంబాలకు సరి పడే ఆహార పదార్థాలను వెయ్యి సంచుల్లో సిద్ధం చేశారు. అలాగే వస్త్రాలను రెడీ చేయించారు. ఈ నెల 5న వరద బాధిత ప్రాంతాలకు సరుకుల లారీతో పాటు వెళ్లి బాధితులకు అందిస్తామని జపానంద తెలిపారు. అలాగే కేరళ రాష్ట్ర బాధితులకు కూడా సాయం అందిస్తామన్నారు.